# పీడీఎస్ లోపాలకు ప్రత్యామ్నాయం ఏంటి?

దేశవ్యాప్తంగా 65 మిలియన్ కుటుంబాలకు ప్రతినెలా అయిదు లక్షల చౌకధరల డిపోల ద్వారా నిత్యావసర వస్తువులను (తిండి గింజలు, పప్పులు, నూనెలు, కిరోసిన్) సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ స్కీం- పీడీఎస్)లో ఎన్నో అవకతవకలు చోటు చేసుకున్నాయి. 1990ల వరకు ఆహార ధాన్యాల సరఫరా అందరికీ అందుబాటులో ఉండేది. వృథా ఖర్చును తగ్గించాలనే ఉద్దేశంతో ఈ సదుపాయాన్ని ప్రస్తుతం పేదరికం దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే వర్తింపచేస్తున్నారు. ఈ ప్రక్రియలో అర్హులైన ఎందరో పేదలు (తెల్లకార్డులు కలిగి లేరనే కారణంతో) సబ్సిడీ ధరలకు నిత్యావసర వస్తువులను పొందలేకపోతున్నారు. పేదలు కాని వారు ఎంతో మంది అక్రమ విధానాల ద్వారా కార్డులు సంపాదించి తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులను పొందుతున్నారు. గ్రామీణ పేద ప్రజలు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లినప్పుడు అక్కడ వీరికి నిత్యావసర వస్తువులు చౌక ధరల్లో లభించవు. వారి కోసం విడుదల చేసిన సరుకును చౌకధరల డిపోల యాజమాన్యాలు అమ్ముకుంటున్నాయి. సరుకు ఎప్పుడు లభిస్తుందో తెలియదు. ప్రకటించిన తేదీల్లో సరకు తీసుకోకపోతే దుకాణపు యజమాని బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకుంటారు. చేతిలో నగదు ఉండి స్పందించినప్పటికీ లభించే సరుకు నాసిరకంగా, తక్కువ తూకంతో ఇస్తారు. పేద కుటుంబానికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే ఒక రూపాయి ప్రతిఫలానికి ప్రభుత్వం నాలుగు రూపాయలు ఖర్చు చేస్తుంది. సరకుల కొనుగోలు, రవాణా, సరఫరాపై నాలుగు రూపాయలు ఖర్చవుతున్నాయి. ఇంత ఖర్చుపెట్టినప్పటికీ 57 శాతం ఆహార ధాన్యాలు అర్హులైన పేదలకు అందట్లేదు. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ₹ 60,600 కోట్లను ఆహార ధాన్యాల సబ్సిడీ కింద వెచ్చించింది. దీనిలో 70 శాతం అవినీతిపరుల చేతుల్లోకే వెళ్లింది. మన దేశంలో పేదరికం లాభదాయక వ్యాపారంగా మారింది. పేద ప్రజల పేరుతో ఆకర్షణీయ పథకాలను ప్రారంభించి ఒకవైపు ఓట్లు పొందడం, మరోవైపు ధనార్జన చేయడం జరుగుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదరికాన్ని గణనీయంగా తగ్గించామని (అధికారిక అంచనాల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు 30 శాతం లోపే!) ప్రభుత్వం చెబుతుంటే.. అయిదేళ్లలోపు వయసు పిల్లల్లో 48 శాతం మందిలో పెరుగుదల లోపించిందనే వాస్తవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ దాదాపు విఫలమైందని, దానికి ప్రత్యామ్నాయాన్ని పరిశీలించాలనే ఆలోచన రావడం సహజం.

## నగదు బదిలీ

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం నగదు బదిలీ చేస్తే ఆ నగదుతో తమకు అవసరమైన ఆహార ధాన్యాలు, కిరోసిన్‌ను



మార్కెట్‌లో కొనుగోలు చేయొచ్చు. దీనివల్ల పేద ప్రజలకు అవసరమైన ముఖ్యావసర వస్తువులను కొనుక్కోవడానికి స్వేచ్ఛ లభించడంతోపాటు పీడీఎస్ కింద కొనసాగుతున్న ప్రజాధన దుర్వినియోగాన్ని అరికట్టడంతోపాటు ప్రభుత్వం మీద వ్యయ భారాన్ని తగ్గించవచ్చని కొందరు మేధావుల వాదన. ఈ పద్ధతి ద్వారా పొదుపు చేసిన ధనాన్ని ఇతర సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించవచ్చని వారి అభిప్రాయం. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి కొన్ని సూచనలు చేసింది. దీని ప్రకారం.. ప్రతి నెల మొదటి వారంలో ప్రభుత్వం సరాసరి ప్రతి పేదకుటుంబంలోని 18 సంవత్సరాల వయసు దాటిన మహిళ పేరిట ఆధార్ సంఖ్య ప్రాతిపదికగా నగదు బదిలీ చేస్తుంది. మార్కెట్ ధరకు, చౌక ధరల దుకాణంలోని ధరలకు మధ్య వ్యత్యాసం బదిలీ అవుతుంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబానికి సగటున నెలకు ₹ 280– 300 రూపాయలు బదిలీ అవుతాయి. జాతీయ సలహా మండలి సూచనల ప్రకారం అది ₹ 300– 350 వరకు ఉంటుంది. తెల్లకార్డుదారులు ఈ నగదుతో చౌక ధరల డిపోల్లో తమ కిష్టం వచ్చిన ఆహార ధాన్యాలను కొనవచ్చు. నగదు చేతికందదు కనుక లబ్ధిదారులు ఆ డబ్బును వేరే అవసరాలకు ఉపయోగించే వీలుండదు.

నగదు బదిలీ విధానం మనదేశంలో ఎప్పటి నుంచో కొనసాగుతోంది. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్, ఆంధ్రప్రదేశ్‌లో కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఫీజు చెల్లింపు, ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యానికి చేసిన ఖర్చును ప్రభుత్వం చెల్లించడం ఇందుకు ఉదాహరణలు. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం' ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లో కనీసం ఒకరికి వంద రోజుల పని కల్పించడం ఒక రకంగా నగదు బదిలీయే. ప్రపంచంలో దాదాపు 30 దేశాల్లో షరతులతో కూడిన నగదు బదిలీ అమల్లో ఉంది. మెక్సికోలో Oportunidades, బ్రెజిల్‌లో Botsa familia నగదు బదిలీ పథకాలు. దక్షిణ అమెరికాలోని హొండురాస్, నికరాగువా, ఈక్వెడార్, డొమినికన్ రిపబ్లిక్, పనామా, పెరూ తదితర దేశాలు ఈ పథకాన్ని

అమలు చేస్తున్నాయి. న్యూయార్క్‌లో రాక్ ఫెల్లర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో Opportunity NYC అనే పథకం అమలవుతోంది. ఆసియా ఖండంలో బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఫిలిప్పైన్స్ వంటి దేశాలు ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయి. ఈ పద్ధతి ఒక రకమైన సామాజిక ఒడంబడిక. పేదలకు ప్రభుత్వం నగదు బదిలీ చేస్తూ.. తమ బిడ్డలను క్రమం తప్పకుండా బడికి పంపాలని, వైద్య కేంద్రాలకు ఆరోగ్య తనిఖీ కోసం పిల్లల్ని తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు షరతు విధిస్తుంది. నగదు బదిలీ పేదలకు అత్యవసర పరిస్థితిలో డబ్బును వినియోగించుకోవడానికి వీలు కల్పిస్తే, దానికి ప్రతిఫలంగా భావి పౌరులైన పిల్లల విద్య ఆరోగ్య విషయాల్లో శ్రద్ధ చూపడం మానవ వనరుల మీద పెట్టుబడి పెట్టడమే. దీనివల్ల ప్రభుత్వం మీద పడే భారం అంతకంటే ఎక్కువ కాదు. బ్రెజిల్‌లో నగదు బదిలీ దాని జాతీయ ఉత్పత్తిలో కేవలం 0.8 శాతం మాత్రమే. ఈ బదిలీ ప్రక్రియకు పాలనాపరమైన ఖర్చు కూడా స్వల్పమే. మెక్సికోలో సగటున ఒక డాలరు బదిలీ చేయడానికి 1.34 డాలరు మాత్రమే ఖర్చవుతుంది. ప్రపంచ బ్యాంకు 13 దేశాలకు నగదు బదిలీ కార్యక్రమం అమలుకు 2009లో 2.4 బిలియన్ యూఎస్ డాలర్ల రుణమిచ్చింది. ఆర్థిక మాంద్యంతో అతలాకుతులమవుతున్న ఈ రోజుల్లో ఈ పద్ధతి వస్తువులకు, సేవలకు గిరాకీ కల్పించి ఉత్పత్తిని పెంచడానికి జీవనోపాధి అవకాశాలు పెంచడానికి తోడ్పడుతుంది. పేదల చేతిలో నగదు ఉన్నప్పుడు వారిలో కొనుగోలు శక్తి పెరిగి సరఫరాకు గిరాకీ ఏర్పడుతుంది. బ్రెజిల్ లాంటి దేశాల్లో పేద ప్రజలు ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు ఆయా ప్రభుత్వాలు అమలు చేసిన నగదు బదిలీ పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయి.

ఈ సంవత్సరం మన దేశ బడ్జెట్‌లో కిరోసిన్, వంట గ్యాస్, ఎరువులకు ఇచ్చే సబ్సిడీ స్థానంలో నగదు బదిలీ పథకాన్ని ప్రవేశ పెట్టడానికి అవకాశం కల్పించారు. ప్రజా పంపిణీ విధానం ద్వారా సరఫరా అయ్యే కిరోసిన్‌లో దాదాపు సగం నుంచి మూడో వంతు వినియోగదారులకు చేరట్లేదు. అది బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతోంది. దాన్ని డీజిల్ కల్తీ చేయడానికి వినియోగిస్తున్నారు. దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన అదనపు కలెక్టర్‌ను (మహారాష్ట్ర-నాసిక్ సమీపంలో) దుండగులు సజీవ దహనం చేసిన ఘటన మనకు తెలిసిందే. 25 శాతం మంది గ్రామీణ పేదలకు అసలు కిరోసిన్ అందట్లేదు. అయితే 75 శాతం మంది పేదలు కాని వారికి లభిస్తుంది. దేశంలో 50 శాతం మంది మాత్రమే పేద ప్రజలని అంచనా వేస్తే వారిలో సగం మందికి మాత్రమే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 66 శాతం కిరోసిన్ లభిస్తుంది. దాన్ని బట్టి 33 శాతం ప్రజలకు మాత్రమే అరకొరగా కిరోసిన్ చౌక ధరల్లో లభ్యమవుతుంది. ఒకవైపు ప్రజాధనం దుర్వినియోగం కావడంతోపాటు, మరోవైపు డీజిల్ కల్తీ వల్ల యంత్రాల సామర్థ్యం తగ్గడం, పర్యావరణ కాలుష్యం పెరగడం వంటి నష్టాలు సంభవిస్తున్నాయి. పేద కుటుంబాలన్నిటికీ, నెలకు అయిదు లీటర్ల చొప్పున కిరోసిన్ లభించాలంటే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న దానిలో 75 శాతం సరిపోతుంది. అంటే సబ్సిడీ భారం 25 శాతం తగ్గుతుంది.

నగదు బదిలీ పద్ధతిని వ్యతిరేకించే వారు కూడా ఉన్నారు. వారు లేవనెత్తే ప్రధాన అభ్యంతరం ఏంటంటే..

ఆహార ధాన్యాల ధరలు తరచుగా పెరుగుతుంటాయి. ఇటీవల కాలంలో ఉల్లి, నూనెలు, పంచదార, పప్పుల ధరలు విపరీతంగా పెరిగాయి. అలాంటప్పుడు వార్షిక లేదా ఆరునెలల ప్రాతిపదికగా ప్రభుత్వం నిర్ణయించే ధరల పట్టిక ప్రకారం అందజేసే నగదుతో అకస్మాత్తుగా పెరిగిన ధరలను తట్టుకోవడం వీలవుతుందా? 'మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు'.. ధరలు తక్కువగా ఉన్న రోజుల్లో కూడా కొనుగోలు శక్తి అంతంతమాత్రంగా ఉన్న పేద ప్రజలు ధరాఘాతాన్ని తట్టుకోలేరు. పైగా నగదు బదిలీ పద్ధతి అర్హులైన పేద ప్రజలను గుర్తించడంలో.. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థకంటే ఏ విధంగా మెరుగైంది? పేద ప్రజల్లో ఎక్కువ మందికి రేషన్ కార్డులు లేవు. వాటి స్థానంలో ప్రవేశ పెట్టాలంటున్న ఆధార్ స్మార్ట్‌కార్డ్ అర్హులందరికీ లభిస్తుందా? ఒకవేళ లభించినా అది దుర్వినియోగం కాదనే గ్యారంటీ ఏంటి? ఆధార్‌లో నిక్షిప్తం చేసిన వేలి ముద్రలు కాయకష్టం చేసే వారి విషయంలో చెరిగిపోయే అవకాశం ఉంది. కనుపాప శుక్లాలున్న వారికి చెరిగిపోతుంది. ఈ పరిమితులను ఆసరాగా తీసుకొని అవినీతిపరులు తప్పుడు వేలిముద్రలతో అర్హుల రేషన్‌ను దొంగిలించే ప్రమాదముంది. దీన్ని నివారించడానికి నగదు బదిలీని ప్రత్యామ్నాయంగా ఉపయోగించినా.. గ్రామీణ పేద ప్రజలందరికీ బ్యాంక్ ఖాతాలుండవు. ఒకవేళ ఖాతాలు తెరిచినా అవినీతిపరులు ఆ డబ్బును కూడా కాజేసే ప్రమాదం ఉంది. మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో తల్లిదండ్రులకు నగదు బదిలీ చేస్తే ఆ డబ్బును బాలలకు పోషకాహారానికి ఉపయోగిస్తారనే గ్యారంటీ లేదు. ఈ పరిమితులన్నిటి దృష్ట్యా నగదు బదిలీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చాలని వాదన.

అనుభవ రీత్యా ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదని మనందరికీ తెలుసు. దానికి ప్రత్యామ్నాయాన్ని సూచించినప్పుడు అది అమలు చేయడానికి అవకాశాన్నిచ్చి, ఫలితాలు ఆశించిన మేరకు లేకపోతే అప్పుడు దాన్ని వ్యతిరేకించాలి. పురిటిలోనే సంధి కొట్టినట్లు ఈ కొత్త విధానాన్ని అమలు చేయకముందే అది పనిచేయదని వ్యతిరేకించడమెందుకు? ప్రతిపాదిత విధానం ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం కంటే మెరుగైందా? కాదా? అనేదే ప్రధాన సమస్య.

ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి సిఫార్సును గుడ్డిగా వ్యతిరేకించడం అర్థరహితం. అలాగని మేధావులు వెలిబుచ్చిన అభ్యంతరాలను సులభంగా తోసిపుచ్చకూడదు. కిరోసిన్, ఎరువుల సబ్సిడీలో జరుగుతున్న అవకతవకలకు ప్రత్యామ్నాయం నగదు బదిలీ. ఆహార వస్తువుల సరఫరాలో లొసుగులకు పరిష్కారం. ప్రభుత్వ ఉప కమిటీ సిఫార్సు చేసినట్లు మార్కెట్ ధర, ప్రజా పంపిణీ ధరల మధ్య వ్యత్యాసాన్ని నగదు రూపంలో లబ్ధిదారుడికి బదిలీ చేయాలి. అయితే ఆ నగదు దుర్వినియోగం కాకుండా, చౌక ధరల దుకాణంలో ఆ నగ

దుతో తనకు ఇష్టమైన ఆహార ధాన్యాలను కొనుగోలు చేసేలా చూడాలి.

గ్రామ సభ, వార్డు సభలను చైతన్యవంతం చేసి అర్హులైన వారికి రేషన్ కార్డులు అందేలా చేయాలి. స్మార్ట్ కార్డు ద్వారా సరకుల సరఫరా చేసి ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చవచ్చు. మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా పౌర సమాజ భాగస్వామ్యంతో నిర్వహించాలి. ప్రస్తుత ప్రజా పంపిణీ వ్యవస్థను ఆహార ధాన్యాల సరఫరాకు పరిమితం చేసి, మిగిలిన వాటిని(కిరోసిన్, ఎరువులు తదితర) నగదు బదిలీ విధానం అమలు చేయడం మంచిది. ప్రత్యామ్నాయాలు అన్వేషించడంలో తప్పులేదు.

## ముఖ్యాంశాలు

- పేద కుటుంబానికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే రూపాయి ప్రతిఫలానికి ప్రభుత్వం నాలుగు రూపాయలు ఖర్చు చేస్తోంది. సరకుల కొనుగోలు, రవాణా, సరఫరాపై నాలుగు రూపాయలు ఖర్చవుతున్నాయి..
- గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఆహార ధాన్యాల సబ్సిడీ కింద ₹ 60,600 కోట్లు వెచ్చించింది.
- అధికారిక అంచనాల ప్రకారం దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు 30 శాతంలోపే.
- ప్రపంచంలో దాదాపు 30 దేశాల్లో షరతులతో కూడిన నగదు బదిలీ పథకం అమల్లో ఉంది.
- నగదు బదిలీ కార్యక్రమం కోసం ప్రపంచ బ్యాంకు 2009లో 13 దేశాలకు 2.4 బిలియన్ యూఎస్ డాలర్ల రుణం అందించింది.
- బ్రెజిల్ నగదు బదిలీ దాని జాతీయ ఉత్పత్తిలో 0.8 శాతం మాత్రమే.
- ఆసియాలో బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఫిలిప్పైన్స్ వంటి దేశాలు నగదు బదిలీ కార్యక్రమాన్ని విజయవం తంగా అమలు చేస్తున్నాయి.

SAKSHI